


## నా మాట

2023వ సంవత్సరంలో స్వాతంత్ర్య భారతదేశంలో బ్రతుకుతున్న అదృష్టవంతులం మనం. భారతదేశం, భారతీయ సమాజం అన్ని రంగాల్లో ఎంతో ప్రగతిని సాధించిన తరువాత పుట్టిన మనం, ఎన్నో రకాలుగా మన ముందు తరాల కంటే అదృష్టవంతులం. ముఖ్యంగా మనకు పరాయి పాలనలో బ్రతికినప్పటి భారతీయుల రాజకీయ, సామాజిక పరిస్థితుల గురించి అవగాహన లేదు. అలాగే, ఆనాటి మహిళల జీవితం గురించి కూడా! ఈ అంశాల గురించి సమగ్రమైన నవల వెలువడిందో, లేదో నాకు తెలియదు. అయితే నేను రాసిన ఈ నవలలో ఆ రెండు రంగాలు స్పృశించబడ్డాయి. కథాగమనానికి అవసరమైనంత వరకే వాటిని ప్రస్తావిస్తూ ముందుకి వెళ్ళాను. కారణం పాఠకులకు నవల చదివే ఆసక్తిని దూరం చేయకూడదనే!

ఈ నవల రాయటానికి 2020 ఏప్రిల్ 25న గతించిన, శ్రీ మంచాళ సీతారామారావుగారి భార్య,, మా తల్లి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి గారు ప్రేరణ.

90 సంవత్సరాల నిండు జీవిత కాలంలో ఆవిడ అప్పుడప్పుడు ఆవిడ చిన్ననాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల గురించి మాతో పంచుకున్న జ్ఞాపకాల పరిమళంతో ఈ నవలా సుమం వికసించింది. ఇందులో పాత్రలన్నీ పూర్తిగా కల్పితాలు. జీవించి ఉన్న లేదా మరణించిన ఏ వ్యక్తి తో నైనా ఎవరికైనా పోలికలు కనిపిస్తే అది కేవలం కాకతాళీయకం మాత్రమే. వాస్తవికంగా కనిపించే రచన చేయటం కోసం కొందరు గొప్ప దేశ నాయకుల పేర్లను వాడటం జరిగింది. అది ఈ తరం వాళ్లకు వారి గొప్పదనాన్ని తెలియజేయటానికి మాత్రమే!

ఈ నవల చదివి, జీవితాన్ని ఫలవంతం చేసుకున్న ఓ మహిళా మూర్తి నుంచి, ఏ ఒక్కరైనా స్ఫూర్తి పొందితే దీని ప్రయోజనం సిద్ధించినట్లే. ఆమె గుణగణాలలో సగమైనా పుణికి పుచ్చుకున్న 'మహిళా రత్న'లు నిజంగా ఎక్కడైనా ఉంటే వారికి నా పాదాభివందనం. వారి జీవితమే ఈ "భారతీయం."

ఈ నవలా రచనకు నాతో పాటు, నేను పడినంత కష్టాన్నీ పడి ప్రోత్సహించిన నా కుటుంబ సభ్యులకు, మిత్రులకు కృతజ్ఞతలు చెప్పుకోకపోతే, ఈ నవలను నేను రచించానని చెప్పుకునే
సాహసం నేను చెయ్యలేను.

ఇది నా తల్లిదండ్రులు మంచాళ స్వరాజ్యలక్ష్మి, మంచాళ సీతారామారావు గార్ల దివ్య స్మృతికి చిన్న కూతురు 'చిన్నా' భక్తి ప్రేమలతో ఇచ్చిన పుస్తక నీరాజనం.

(గత సంచిక తరువాయి)

33

స్వాతంత్ర్యం వచ్చాక మొదటి సంక్రాంతి. సంక్రాంతి అంటేనే సందడి. పుష్యమాసంలో పంటలు ఇంటికొస్తాయి. వ్యవసాయ ప్రధానమైన ఆర్ధిక వ్యవస్థ కలిగి ఉన్న భారత దేశంలో దాదాపు డెబ్బై శాతం ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి బ్రతికేవాళ్ళు ఆ రోజుల్లో. చిన్నకారు, సన్నకారు రైతులకే పెద్ద పండుగ అయిన సంక్రాంతి ఊరిలో పెద్ద మోతుబరి అయిన పార్వతీశం ఇంట్లో ఘనంగా జరపబడటంలో ఆశ్చర్యమేముంది? అందునా కూతుళ్ళిద్దరి పెళ్ళిళ్ళై కొత్త అల్లుళ్లిద్దరు ఉన్నప్పుడు ఆ సందడే వేరు. ఆ సంబరానికి తోడు సరళ నెల తప్పిందన్న వార్త అందరినీ ఆనందంలో ముంచెత్తింది. హైమవతికీ, శారదమ్మకీ చేతినిండా పని. శయనమ్మసుశీల వెళ్లిపోయిందన్న దిగులు నించి బయట పడి సరళను జాగ్రత్తగా చూసుకోవటంలో మునిగి పోయింది. వీళ్ళందరి ఆదరణతో సరళకు పుట్టిల్లు కూడా గుర్తు రావట్లేదు

సంక్రాంతికి ఇంటిల్లిపాదికే కాక ఇంట్లో ఉండే చిన్నపాలేర్లకి, పెదపాలేరుకి, అందరికీ బట్టలు కొన్నాడు పార్వతీశం. కోతలు పూర్తి అయ్యి గాదెలు నిండాయి. ఏడాది కష్టానికి ప్రతిఫలంగా ఇంట్లో పనిచేసే వారందరికీ ధాన్యం, డబ్బుల పంపిణీలు అయిపోయాయి. ఎవరి మొహాలు చూసినా సంతోషంగా ఉన్నాయి.

ఇంట్లో ఆడవాళ్లు అందరూ కలిసి అరిసెల్లాంటి పిండివంటలు చేస్తుంటే, ఆ నేతి సువాసన ఇంటి ముందు వీధిలో వెళ్ళేవాళ్ళను కూడా ముక్కుపుటాలు ఎగరేసేలా చేస్తోంది. ప్రతి ఇంటి ముందు ముగ్గులు, ముగ్గుల్లో గొబ్బెమ్మలు, గొబ్బెమ్మల్లో గొబ్బిపూలు. ఊళ్ళో తెల్లవార కుండానే గంగిరెద్దుల మేళం మొదలు. ప్రతి ఇంటి వాళ్ళు గంగిరెద్దుకి తినటానికి ఏదో ఒకటి ఇవ్వటమే కాకుండా ఇంట్లో పాతబట్టలు కూడా తెచ్చి దానిపైన వేస్తున్నారు. హరిదాసులు "హరిలో రంగ హరి"అంటూ అన్ని ఇళ్ళూ తిరుగుతున్నారు. ఏ వూళ్ళో చూసినా ఈ దృశ్యాలు కనుల పండుగ చేస్తున్నాయి. అందుకే సంక్రాంతిని పెద్ద పండుగ అంటారు కాబోలు.

తెల్లవారకుండానే వేసే చలిమంటల చుట్టూరా ముసలివాళ్ళు చేరి, వాళ్ళ చిన్నప్పటి సంగతులు తిరగదోడుకుంటున్నారు. కన్నెపిల్లలు, చిన్న పిల్లలు ఉన్న ఇళ్లల్లో సందె గొబ్బెమ్మల పేరంటాళ్ళు రోజూ జరుగుతూనే ఉన్నాయి. శయనమ్మ "అందరిల్లు"లో ఉన్న ఆడపిల్లల చేత సందె గొబ్బెమ్మలు పెట్టించి

"అటవీ స్థలముల కరుగుదామా,

వట పత్రమ్ములు కోయుదమా! "

"విత్తులు విత్తులు విత్తేరంట, ఏమి విత్తులు విత్తేరంట?

రాజావారి తోటలోన జామవిత్తులు విత్తేరంట! "

"కొలని దోపరికి గొబ్బిళ్ళో, గొబ్బిళ్ళో.

యదుకుల స్వామికిని గొబ్బిళ్ళో గొబ్బిళ్ళో "

వంటి పాటలు పాడి, వాళ్ళచేత పాడిస్తూ ఆ గొబ్బెమ్మల చుట్టూరా చప్పట్లు కొడుతూ తిప్పించింది. తరవాత నాన బెట్టిన పెసరపప్పులో కొబ్బరి కలిపి ఉప్పుకారాలు వేసి, నిమ్మరసం పిండి గొబ్బెమ్మలకు నైవేద్యం పెట్టించి, దాన్ని బాదం ఆకులలో పెట్టి అందరికీ పంచి పెట్టించింది. సాంప్రదాయాలను పాటించేలా చేసి తరువాతి తరాలకు అందిస్తుంటేనే కదా సంస్కృతి నిలిచేది!.

భోగినాడు తెల్లవారుఝామునే వేసిన భోగి మంటల్లో అందరూ ఇంట్లో ఉన్న పాత సామానంతా తెచ్చి పడవేశారు. కట్టె పొంగలి వండుకున్నారు. పసిపిల్లలున్న వాళ్ళు రేగిపళ్ళు, శనగలు, చిల్లర, చెరుకు ముక్కలు కలిపిన భోగిపళ్లు పోశారు. "అందరిల్లు"లో ఉన్న ఐదేళ్ల లోపల పిల్లలకి హైమవతి, రాజేశ్వరి, భారతి కలిసి భోగిపళ్లు పోశారు.

“మనింట్లో పిల్లలు లేక పోయినా ప్రతి ఏడు ఈ భోగి పళ్ళ జాతర తప్పట్లేదు “ విసుక్కుంది రాజేశ్వరి.

హైమవతి కోప్పడింది “నీకు విసుగు లేనిది దేనికే రాజూ, నీ పిల్లలకి పళ్ళు పోయటం ఎలాగో నేర్చుకుంటున్నా ననుకో” మూతి మూడు వంకర్లు తిప్పింది రాజేశ్వరి.

“ఆలూ లేదూ, చూలూ లేదు, అల్లుడి పేరు సోమలింగమనీ..”రాజేశ్వరి విసుక్కుంది. అందరూ నవ్వేశారు. సరళ వచ్చిన వాళ్లందరికీ పండు, తాంబూలా లిచ్చి పంపింది.

సంక్రాంతికి బొమ్మలు పెట్టే ఆచారం ఉన్నవాళ్ళకి అది బొమ్మల పండుగ. పార్వతీశం ఇంట్లో ఆ సంవత్సరం కొన్న కొత్త బొమ్మలతో సహా బొమ్మల కొలువు అందంగా అమర్చి ఊరందరినీ పేరంటానికి పిలిచి తాంబూలా లిచ్చారు. దానితో పాటే సరళకు శ్రీమంతం పేరంటం కూడా చేసి పుట్టింటి వాళ్ళు పురిటికి తీసుకు వెళ్ళారు. కనుమనాడు మినుము కొరకాలని గారెలు చేశారు. ముక్కనుమ నాడు పనివాళ్ళందరికీ సెలవు.

ముకుందం, మురారి, రవి, ప్రసాద్ ఇంటికి వచ్చిన కొత్త అల్లుడు నాగరాజుని చేతులు పట్టుకు ఆహ్వానించి లోపలికి తెచ్చారు పాత సంగతులు మరచిపొమ్మన్నట్లు. నాగరాజులో చాలా మార్పు వచ్చింది. ఆ ఇంటికి తగిన

అల్లుడనిపించుకునే విధంగా తన ఆలోచనలనూ, ప్రవర్తననూ తీర్చి దిద్దుకుంటున్నాడు. శ్రీనివాసులు, అలిమేలు మటుకు ఎంత పిలిచినా రాలేదు.

“ఈ సారికి వదిలెయ్యండి బాబుగారు. వచ్చే సంవత్సరం చూద్దాం." అన్నాడు శ్రీనివాసులు. వారి భాషలో కూడా ఎంతో మార్పు వచ్చింది. అలిమేలు తన ఇల్లు శుభ్రంగా ఉంచుకోవటమే కాక వాడ శుభ్రంగా ఉంచటంలో అందరికీ సహాయం చేయటం నేర్చుకుంది. పండుగకి పిలవటానికి వాళ్ళ ఇంటికి భార్యాసమేతంగా వెళ్ళాడు పార్వతీశం. ఇంటి చుట్టుపక్కల వచ్చిన మార్పు చూసి, అద్దంలా ఉన్న ఆ ఇంటిని చూసి హైమవతి ఎంతో సంతోషించింది. అలిమేలు కట్టు బొట్టు కూడా పూర్తిగా మారిపోయాయి. మోకాళ్ళ కిందకి కాకుండా ఇప్పుడు మడమల కిందకి చీర కడుతోంది ఆమె.

భారతి, రవి, శారద, శ్రీకాంత్ కూడా ఆ మూడురోజులు పార్వతీశం ఇంట్లోనే గడిపారు. శయనమ్మకు అందరిలోనూ సుశీల లేకపోవటం ఒక వెలితిగా అనిపించింది. హైమవతి శేషుని తలచుకుని బాధపడింది. శారదమ్మ మనసులో ఏముందో ఆవిడకీ, ఆ భగవంతుడికే తెలియాలి.

ఇద్దరు కూతుళ్ళు, అల్లుళ్ళకి పండగకి బట్టలు పెట్టాడు పార్వతీశం. ఈ సారి పెద్ద అల్లుడితో కొంచెం మాట్లాడింది హైమవతి. చూపుల్లో అసహ్యాన్ని కురిపించలేదు. నాగరాజు కూడా ఆమెతో మాట్లాడటంలో కొంచెం చొరవ చూపాడనే చెప్పాలి. మొత్తం మీద పండుగ బ్రహ్మాండంగా గడిచి పోయింది.

ప్రసాద్ దరఖాస్తులు పెట్టుకున్న ఉద్యోగాలలో అందరికీ సంతోషానిస్తూ అతనికి విజయవాడలోని ఒక కళాశాలలో జూనియర్ అధ్యాపకుడిగా ఉద్యోగం వచ్చింది. పండగ అయిన మర్నాడే ప్రసాద్ ఉద్యోగ వార్త తెలియడంతో మరోసారి పండుగ జరుపుకున్నారు పార్వతీశం వాళ్ళు. రవి గోల్డ్ మెడల్ తెచ్చుకుని ప్లీడరుగా ప్రాక్టీసు పెడితే, మురారి చదువు పూర్తి అయ్యింది.

## 34

గట్టిగా రెండువారాలయ్యిందేమో సంక్రాంతి వెళ్లి. ఇంకా ప్రజలు అదే ఉత్సాహంలో ఉండగా, దేశాన్ని మొత్తాన్ని కారుచిచ్చులా కమ్మేస్తూ రేడియోలో వెలువడిందా వార్త. మహాత్మాగాంధీ ని నాథురాం గాడ్సే అనే అతను కాల్చి చంపేశాడు. జాతిపిత ఇక లేరు. గాంధీ తాత చనిపోయారు. ఆయన నేలకూలుతూ పలికిన ఆఖరి మాటలు "హే రామ్". ఆ వార్తను నమ్మలేని భారత జాతిని నమ్మించటానికా అన్నట్టు పడే పడే వార్తలలో అదే వార్తను ప్రముఖంగా ప్రసారం చేసింది ఆకాశవాణి.

జాతి యావత్తు శోక సముద్రంలో మునిగిపోయింది. బ్రిటిష్ వారిని అహింస ఆయుధంగా చేసుకుని జయించగలిగిన మోహన్ దాస్ కరం చాంద్ గాంధీ, ఒక భారతీయుడి చేతిలో తుపాకీ దెబ్బకు రక్తం కారుస్తూ బలి అయ్యిపోయాడు. ప్రపంచానికి అహింసని బోధించిన మహాత్ముడు ఒక భారతీయుడి చేతిలోనే హింసకు గురై మరణించటమనేది విధి విచిత్రం. ఆ వార్త విన్న భారతీయులే కాదు, శాంతిని కాంక్షించే ప్రతి ఒక్కరూ తల్లడిల్లి పోయారు. ప్రపంచం మొత్తం ఆయనకు అశ్రు నివాళులర్పించింది.

పది లక్షల మంది ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు. మిగిలినవారు వారి వారి స్వస్థలాలనుంచే నివాళులర్పించారు. ప్రపంచ చరిత్రలో 'సత్యాగ్రహం"అనే ప్రక్రియను ప్రవేశపెట్టిన గాంధీ ప్రపంచం నుండి సెలవు తీసుకుని నిష్క్రమించాడు. ఒక అధ్యాయం ముగిసిపోయింది. ఆల్బర్ట్ ఐన్ స్టీన్ వ్యాఖ్యానించినట్లు భవిష్యత్ తరాలవారు గాంధీ అని ఒక మనిషి ఈ భూమి మీద రక్త మాంసాలతో ఒకప్పుడు నడయాడాడంటే నమ్మటం కష్టం!

గాంధీ గారి హత్య వార్త విన్న శయనమ్మ ఒక్కసారిగా నిర్విణ్ణురాలయ్యింది. ఆమె నోటి వెంట మాట రాలేదు. సొమ్మసిల్లినట్లు పడి పోయింది. అందరిల్లులో ఉన్న గాంధీగారి విగ్రహం ముందు కన్నీరు కారుస్తూ కూలబడి పోయిందామె. మూడు రోజుల పాటు తిండి, నీళ్ళు ముట్టుకోలేదు. ఎవరితోనూ మాట్లాడలేదు. ఎవరెంత నచ్చజెప్పినా ఆ విగ్రహం ముందునుండి లేవలేదు.

ఏమైంది నా దేశానికి? ఒక భారత దేశీయుడు జాతిపితను చంపటం ఏమిటి? అసలెలా చంపగాలిగాడు? గాంధీ సిద్ధాంతాలతో విబేధించే వారు కూడా ఈ సంఘటన జీర్ణించుకోలేకపోయారు. ఆయన ఒక్క మాట మీద ఎంతటి సంగ్రామం జరిగింది స్వాతంత్ర్యం కోసం? అలాంటి మహానుభావుడు, ముసలివాడు, శారీరకంగా బలహీనుడి మీద కాల్పులు జరపట మెంత అమానుషం? ఇందుకా మనం స్వాతంత్ర్యం సంపాదించుకుంది? శయనమ్మ ఆయనను చూసిన సందర్భాలను గుర్తు చేసుకుని కుళ్ళి, కుళ్ళి ఏడ్చింది.

శయనమ్మ ఒక్కతే కాదు దేశంలోని కోట్లాది ప్రజానీకం ఆ రోజు తేరుకోలేని దుఃఖంలో మునిగిపోయారు. శయనమ్మ గారిని ఆ దుఃఖం నుంచి బయట పడెయ్యటం ఎవరి వలనా కాలేదు. ఆమె బేలగా దుఃఖించడం చూసి 'అందరిల్లు" లో ఉన్న చిన్న, పెద్ద అందరూ అల్లాడిపోయారు. వారికి తెలిసింది ధీర అయిన శయనమ్మే కానీ ఈ బేల అయిన శోకమూర్తి కానే కాదు. ఆ నాటినుంచి శయనమ్మగారి ఆరోగ్యం క్రమ క్రమంగా క్షీణించటం మొదలయ్యింది. తను ప్రాణప్రదంగా పెంచిన కూతురు తనను వదిలేసి వెళ్ళిపోయినా తట్టుకోగలిగిన ఆమె హృదయం, జాతిపిత మరణాన్ని తట్టుకోలేక పోయింది. అది ఆమెలో ఉన్న దేశభక్తికి, దేశ నాయకులని తన కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా ప్రేమించే మనస్తత్వానికి తార్కాణం. ఆమెలాంటి నిజమైన దేశభక్తు లెందరో ఆ రోజుల్లో.

గాంధీగారి మరణం నుంచి దేశం ముందుకు వెళ్ళిపోయింది కానీ శయనమ్మ గారు మటుకు అక్కడే ఉండిపోయింది. గాంధీ గారి మరణం ఆమెను పూర్తిగా కృంగదీసింది. పులిలా ఉండి అందరికీ పెద్ద దిక్కుగా ఉన్న ఆమె మంచం పట్టే పరిస్థితికి వస్తోంది. "అందరిల్లు"ని సమర్ధించే ఆసక్తి, శక్తి ఆమెలో క్రమక్రమంగా అణగారిపోతున్నాయి. ఆ విషయం ఆమెకే అర్ధమై ఆందోళన కలిగిస్తోంది కానీ ఆ నిరామయ స్థితి నుంచి బయటకు రాలేకపోతోంది. ఎందరికో సేవలు చేసి దోవ చూపించిన శయనమ్మగారికి ఆమె పనులు ఆమె చేసుకోవటానికి కూడా సహాయకులు అవసర మవుతున్నారు. ఆమె పరిస్థితి అందరికీ ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా పార్వతీశం కుటుంబానికి. భారతి, హైమవతి ఎంత ప్రయత్నిస్తున్నా శయనమ్మ పరిస్థితిలో మార్పు రావట్లేదు.

★★★★★

నిర్దయగా, నిర్మోహంతో, నిశ్చలంగా సాగిపోవటమనేది ఒక్క కాలానికే చెల్లింది. భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చింది. ఆ నాటితో భారత దేశం సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగామారింది. ఆ సంవత్సరమే ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి కోసమని పంచవర్ష ప్రణాళికలను రూపొందించే ప్రణాళికా సంఘం అప్పటి భారత ప్రధాని జవాహర్ లాల్ నెహ్రు అధ్యక్షతన ఏర్పడింది.

★★★★★

కాలచక్ర భ్రమణంలో భారతికి ఒక పాప హరిణి, రాజేశ్వరికి ఒక పాప రాగిణి పుట్టారు. పాప పుట్టిన మూడు నెలల్లోనే రాజేశ్వరి మళ్ళీ గర్భవతి.

ఒకరోజు సాయంత్రం భారతి "అందరిల్లు" వైపు చూస్తోంది పైనుంచి. మునుపటి సందడి, కార్యక్రమాలు ఆమెకు కనిపించట్లేదు. పిల్లలకు చదువు చెప్పవలసిన అధ్యాపకుడు రావట్లేదు సరిగ్గా. ఏవో కారణాలు చెపుతుంటాడు. పిల్లలు వ్యాయామాలు చెయ్యట్లేదు. పరిసరాల గురించి శయనమ్మగారు పట్టించుకోక పోవటం వలన ఆవరణ అంతా గడ్డి గాదం పెరిగిపోయాయి. పెరట్లో  ఆవులు మేత కోసం ఎదురుచూస్తూ అంబా అంటుంటే వాటిని పట్టించుకునే దిక్కే లేదు. ముసలివాళ్లను చూస్తే అన్నం సరిగ్గా తింటున్నారా లేదా అన్నట్లున్నారు. ఎందుకిలా జరుగుతోంది?ఎవ్వరిలోనూ ఏవిధమైన ఆసక్తీ కనిపించటం లేదు శయనమ్మగారు ఉండగానే?

భారతి మనసెంతో బాధకు గురి అయ్యింది. సరళ పురుడు మాట అటుంచితే, తనకు, రాజేశ్వరికి పురుడు అయ్యేవేళ్టికి కూడా శయనమ్మ గారు శారీరకంగా బాగానే ఉంది. కానీ ఇప్పుడు రాను రాను ఆవిడలో పూర్తి మార్పు వచ్చేస్తోంది. ఎక్కడా జీవం కనిపించట్లేదు. దీనికి మూలకారణం ఏమిటి? ఆమె ఎంతో ఆరాధించే గాంధీ గారి

మరణమేనా? మరీ అంత భక్తి ఉన్నదా ఆమెకు ఆ జాతి పితమీద? దేశంలో ఈమె ఒక్కతేనా ఇట్లా ఉందీ, ఇంకా ఎందరో ఉండి ఉంటారా?

ఆమె అలా ఆలోచనా ప్రవాహంలో కొట్టుకు పోతుండగానే కోర్ట్ నుంచి రవి వచ్చాడు. తను వచ్చే అలికిడిని గాలిలోనే పసిగట్టగల భార్య, పైకి వచ్చినా పట్టించుకోని పరధ్యానంలో ఉండటం అతన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. భారతి చూస్తున్న వైపే చూపు సారించిన అతనికి ఆమె ఆవేదన అర్థమయ్యింది.

"చేసే శక్తి ఉండీ చూస్తూ ఊరుకునే వాళ్ళని ఏమనాలీ?" గంభీరంగా ఉన్న భర్త  గొంతు విని ఉలిక్కిపడి అతని వైపు తిరిగింది భారతి. ఆమె కళ్ళనిండా నీళ్లు. అతని మాటలు అర్థం అయ్యీ, కానట్లున్నాయి ఆమెకు.

"ఎవరినంటున్నావు మావయ్యా? " అనుమానంగా అడిగింది.

"ఎవరినో నేనెందుకంటాను? నిన్నే." భారతిని నిశితంగా గమనిస్తూ అన్నాడతను.

"నీ ఉద్దేశ్యం స్పష్టంగా చెప్పు."

"నీకర్థం కాలేదంటే నమ్మను. నా భార్య అంత తెలివి తక్కువది కాదు. నువ్వివాళ చూస్తున్న ఈ దృశ్యం ఇటీవల కాలంలో కొత్తేమీ కాదు. శయనమ్మ గారు పుట్టిన దగ్గరనించి ఈ నాటి వరకు జీవితంతో పోరాడుతూనే ఉన్నారు. ఆవిడ ఎదుర్కొన్న సమస్యలు, సాధించిన విజయాలు నీకు తెలుసు. డెబ్బైయేళ్ల ముసలి వయసు లోనూ, మానసికంగా, శారీరకంగా కృంగిపోయి కూడానూ ఆవిడ "అందరిల్లు"భారం మోయాలా? ఆవిడ నీకేమవుతుందని 'అమ్మమ్మా' అని నోరారా పిలిచి ఆవిడ దగ్గర అన్ని గారాలు పోయావు? నీకేం బాధ్యత లేదా?" ఆవేశంగా అన్నాడు రవి.

"అదికాదు మావయ్యా.... "ఏదో చెప్పబోయింది భారతి.

"......ఏది కాదు? తలచుకుంటే ఏదన్నా అవుతుంది. ఏదన్నా బాధ్యతను వద్దనుకోవటానికి వంద కారణాలుంటాయి. స్వీకరించటానికి ఒక్క కారణం ఉంటే చాలు. ఆ కారణం నువ్వు సుశీల కిచ్చిన మాట. మర్చిపోయావా? ఎంతో ఉన్నతాశయాలతో శయనమ్మ గారు మొదలు పెట్టిన ఆ సంస్థ పేరే "అందరిల్లు" కదా. మరి మన అందరింటికీ నువ్వేమీ చెయ్యవా? దాని కప్పు కూలిపోతుంటే చూస్తూ ఊరుకుంటావా?

"అది కాదు మావయ్యా. నేను అలాంటివాటిలో మునిగిపోతే నిన్ను, మన బాబును సరిగ్గా చూసుకోలేనేమో అని" సంజాయిషీగా అంది భారతి.

"ఇలా మాట్లాడటానికి నీకు సిగ్గుగా లేదా భారతీ? నీలో ఇంత స్వార్ధం ఉందని నేను అనుకోలేదు. దేశం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన కేశవరావు, సుబ్బమ్మ గార్ల మనవరాలివి నువ్వు. సుబ్బారావు గారి మరదలివి నువ్వు. మీ నాన్న పార్వతీశం నీకు ఇచ్చిన పూర్తి పేరును మరచి పోయావా? "నవ్య భారతి". ఆ కుటుంబంలో పుట్టి ఇంత సంకుచితంగా నా కుటుంబం, నేను అని మాత్రమే ఎలా ఆలోచించగలుగుతున్నావు? నీ వంటి నవ్య భారతులు ఈ నవ్య భారతానికి సహాయ పడకపోతే, స్వార్ధపరులైపోతే ఇక దేశం ఏమైపోవాలి?

"అటువంటి పనులు చేయాలంటే ఎంతో తెలివితేటలు కావాలి కదా మామయ్యా. నేను ఎక్కువ చదువుకోలేదు కదా" బేలగా అంది భారతి ఆమెకు తనమీద తనకు నమ్మకం తక్కువ.

“ఎవరన్నారు భారతీ నువ్వు చదువుకోలేదనీ? నీకు డిగ్రీ లేదంతే, అదీ నువ్వు పరీక్ష రాయలేదు కనుక. నీకు లా లో సెక్షన్ లను గుర్తు చేస్తావు నువ్వు! నిన్ను నువ్వు ఎప్పుడూ తక్కువగా అంచనా వేసుకోకు. నువ్వో పనిలోకి దిగితే ఎంత నిబద్ధతతో చేస్తావో నాకు తెలుసు, నీకూ తెలుసు. శయనమ్మ గారు మటుకు పెద్ద పెద్ద చదువులు చదివేసారా? ఇటువంటి సామాజిక సేవ చేయటానికి ముందుగా కావాల్సింది సంకల్పం, చిత్తశుద్ధి. అవి నీలో ఉంటే చాలు. నీ వెనక నేను లేనా?" భారతి కళ్ళల్లో నమ్మకం నిండింది.

"మావయ్యా, నువ్వన్నది నిజం, నాకు చేతైనంత సేవ తప్పనిసరిగా చేస్తాను. నేనిచ్చిన మాట నిలబెట్టుకుంటాను. ఇప్పుడే వెళ్దాం పద"

"శయనమ్మగారు మొదలు పెట్టిన నాటికీ, ఇప్పటికీ దేశంలో, సంఘంలో సమస్యల తీరు మారింది. అది దృష్టిలో పెట్టుకుని నీ కార్యాచరణ రూపొందించుకో. నీ వెనుక నేనున్నాను."భార్య భుజం తట్టాడు రవి.

★★★★★

"అమ్మమ్మా" ఆ పిలుపు అచ్చం సుశీల "అమ్మా" అన్నట్లే వినిపించింది శయనమ్మకు. నిస్త్రాణగా తులసికోటకు ఆనుకుని కూర్చున్న ఆమె గబుక్కున లేవబోయింది. రవితో కూడా "అందరిల్లు"కి వచ్చిన భారతి చప్పున ఆమెకు చెయ్యి అందించింది. ఆమె చెయ్యి ఊతగా తీసుకుని లేచింది శయనమ్మ. ఆమె భుజం మీద చెయ్యివేసి నడిచింది. ఆమెను పట్టుకుని నడిపిస్తూ లోపలకు తీసుకు వెళ్ళింది భారతి. రవి అక్కడ ఉన్న లాంతర్లను వెలిగించటంతో అంత సేపు చీకటిలో ఉన్న "అందరిల్లు" అంతా కాంతి నిండింది. ఆ వెలుగులో శయనమ్మ మొహంలో బలహీనత స్పష్టంగా కనిపించింది. ముందు గదిలోకి దారి తీసింది శయనమ్మ. అక్కడ సుశీల కూర్చునే కుర్చీ ఖాళీగా ఉంది. దాని ముందు బల్లమీద రసీదులు, పుస్తకాలు, సిరాసీసా, కలం అన్నీ చిందరవందరగా పడివున్నాయి. అక్కడే కూర్చుని సుశీల పనిచేసుకునేది.

ఒక్క నిమిషం సుశీల అక్కడ కూర్చుని 'రా భారతీ' అన్నట్లు అనిపించి భారతి కళ్ళల్లో చివ్వున నీళ్ళు చిమ్మాయి. అప్రయత్నంగా ఆ కుర్చీ దగ్గరకు వెళ్ళి అందులో కూర్చుంది.

చూస్తున్న శయనమ్మ కళ్ళు మెరిశాయి.

"ఈ వరమే నేను అడుగుదామనుకున్నా. నువ్వే ఇచ్చావు భారతీ! నువ్వు పుట్టినప్పుడు నేను లేను. మర్నాడు వచ్చాను. సుశీల చెప్పింది నువ్వు పుట్టావని. ఒక్కపరుగున నిన్ను చూడటానికి వస్తే, నువ్వు నన్ను చూసి నవ్వావని అనిపించింది. పురిటికందువి, నన్నెలా చూస్తావు చెప్పు, నా పిచ్చి కానీ." శయనమ్మ తనలో తనే మాట్లాడుకుంటోందా అనిపించింది భారతికి ఓ క్షణం.

"నీ పేరు 'నవ్యభారత లక్ష్మి' అని చెప్పగానే నా కెంత సంబర మనిపించిందో! స్వాతంత్ర్యం వచ్చాక నవ భారతం ఎంత గొప్పగా ఉంటుందో అని కలలు గన్నాను. కానీ చూసావా? గాంధీ గారినే పొట్టన బెట్టుకుందమ్మా ఈ భారతదేశం. స్వాతంత్ర్యం ఎక్కువైపోయి, తనకి దాన్ని సాధించి ఇచ్చిన ఒక జాతీయ నేతని, ఒక మహాత్ముడిని బలితీసుకుందమ్మా ఈ భారత జాతి." ఉద్వేగంతో ఊగిపోయింది శయనమ్మ.

"గాంధీ గారు వెళ్ళిపోయి కూడా మూడేళ్లవుతోంది అమ్మమ్మా. ఇంకా నువ్వు తేరుకోకపోతే ఎలా?"

"ఎలా తేరుకునేదీ? తల్లీ భారతీ, ఇటువంటి జాతికోసం కాదమ్మా మేమందరం అన్ని కష్టాలు పడింది! ఇటువంటి బిడ్డలను కాదమ్మా భరతమాత కోరుకునేదీ ! ప్రపంచానికే ఆదర్శప్రాయమైన జాతి మనది కావాలి. జాతి రత్నాలు పుట్టాలి ఈ గడ్డ మీద. అన్నిదేశాలకీ నా దేశం శాంతి మంత్రం ఉపదేశించాలి. స్నేహ హస్తం అందించాలి. ఉన్నవాడు లేనివాడికి ఆసరా ఇవ్వాలి. హీనులను, దీనులను ఆదుకోవాలి. విధివంచితులకు చేయూత నివ్వాలి. అనాథలనే వారు లేకుండా చెయ్యాలి. అటువంటి భారత దేశం కోసం నువ్వు కృషి చేస్తావా తల్లీ! " అప్పటివరకూ ఆవేశంగా మాట్లాడుతున్న శయనమ్మ గొంతు దీనంగా మారిపోయింది.

"చేస్తానని మాటివ్వమ్మా. చిన్నప్పుడు నా వేలు పట్టుకుని వదిలేదానివి కాదు. ఇప్పుడు నా ఆశయాల వేలు వదలకుండా ముందుకి నడిపిస్తానని ఒట్టు వెయ్యమ్మా" భారతి కదిలిపోయింది శయనమ్మగారి ఆవేదన చూసి.

"నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తా అమ్మమ్మా. నీ ఆశలను నెరవేర్చటానికి ఎంతకష్టమైనా పడతా. ఈ "అందరిల్లు" బాధ్యత ఇకనుంచి నాది. నువ్వు దిగులుపడకు." శయనమ్మ మొహంలో వెలుగు వచ్చింది.

"నాన్నా రవీ, బాబుగారు ఇంట్లో ఉంటే ఒక్కసారి పిలుచుకు వస్తావా? అడిగింది శయనమ్మ భారతితో పాటు వచ్చిన రవిని చూసి. రవికి కూడా అదే మంచి దనిపించింది ఆవిడ పరిస్థితిని చూస్తుంటే.

"భారతీ, బామ్మ దగ్గర కూర్చో"అని భారతికి చెప్తూ పార్వతీశం ఉన్నాడేమో చూడటానికి పరిగెత్తాడు రవి. భారతి శయనమ్మ దగ్గర కూర్చుని ఆవిడ నుదురు మీద చిన్నగా రాయసాగింది.

“అమ్మమ్మా, నిన్ను మేమందరం రాజ్య సభకు పంపిద్దామని అనుకుంటుంటే నువ్విలా అడ్డం పడితే ఎలా?” శయనమ్మ మొహంలో నవ్వు మెరిసింది.

"ఇప్పుడూ హాస్యాలేనా? నేను వెళ్ళిపోయే సమయం వచ్చినా కూడా! గుర్తుందా చిన్నప్పుడు ఎప్పుడూ నా నెత్తి మీద ముసుగును ఉండనిచ్చేదానివి కాదు. నాకు శ్రీనివాసులు జుత్తు పని చేసి వెళ్ళగానే 'అమ్మమ్మా, నువ్వు ఆడా, మగా' అనేదానివి." భారతికి గుర్తొచ్చి నవ్వొచ్చింది. ఆవిడ జుట్టు తీయించుకున్నాక, పంచెకట్టుకుని ఉంటే నిజంగానే ఆడో మగో తెలిసేది కాదు ఆ వయసులో. శయనమ్మ కళ్ళు మూత పడ్డాయి.

“"అందరిల్లు" ఇక నీ బాధ్యతే భారతీ. హరిణి ఒక్కతే కాదు. ఇక్కడ నీకెంతో మంది బిడ్డలున్నారు. అందరినీ జాగ్రత్తగా చూసుకుంటావు కదూ" అంది కళ్ళు మూసుకునే.

"తప్పకుండా చూసుకుంటాను అమ్మమ్మా" అంది భారతి శయనమ్మ పరిస్థితికి భయపడుతూ. ఆమె కళ్ళవెంట జల జల నీళ్ళు రాలాయి ఆ సమయంలో కూడా శయనమ్మగారు "అందరిల్లు" గురించి మాట్లాడటం చూసి. ఉన్నట్లుండి శయనమ్మ లేచి కూర్చుంది.

"అదిగో, నా బిడ్డ, నా సుశీల వస్తోంది. రా అమ్మా, సుశీలా నీ కోసమే ఈ ప్రాణాలు నిలిచాయి. రా " మంచం దిగబోయింది.

"అమ్మమ్మా, సుశీల ఎక్కడుందీ? అంతా నీ భ్రమ."

"భారతీ, భ్రమకాదు, అదిగో సుశీల వస్తోంది. వీధి గుమ్మం దగ్గర బాబుగారు, అమ్మాయి, రవి వస్తున్నారు" భారతిని ఒక్కసారి విదుల్చుకుని లేచి నిలబడింది శయనమ్మ. గుమ్మం కేసి పరుగు తీసింది.

"అమ్మా సుశీలా" అంటూ వీధి గుమ్మం వైపు వెళ్లబోయి నేలమీద ముందుకు పడిపోబోయింది. ఆఖరి నిమిషంలో ఎక్కడనించి వచ్చిందో సుశీల,

"అమ్మా!"అంటూ శయనమ్మను పడకుండా ఆపి తన వళ్లోకి తీసుకుంది.

"వచ్చావా తల్లీ" సుశీల మొహాన్ని వెర్రి ఆనందంతో చేత్తో తడుముతూ, ఆనందంగా నవ్వుతూ “నీ మాట నిలబెట్టుకోవేమో అనుకుని భయపడుతున్నా” అని కళ్ళు మూసుకుంది శయనమ్మ. ఆ కళ్ళు ఇక తెరుచుకోనే లేదు.

గుమ్మంలో పడిపోయిన శయనమ్మను అయోమయంగా చూసింది భారతి. ఆమెకు సుశీల కనిపించనేలేదు. శయనమ్మ పడ్డ శబ్దం విని ఒక్క పరుగున బయట ఉన్న వాళ్ళందరూ పరిగెత్తుకు వచ్చారు. వీధి తలుపు శబ్దానికి తలెత్తి చూసింది భారతి. పార్వతీశం, హైమవతి పరిగెట్టుకుంటూ లోపలకు వస్తున్నారు. వాళ్ళ వెనుకే రవి, శారదమ్మ. వెనకాల మిగిలిన వారందరూ పరుగు పరుగున వచ్చారు. ఒక్క క్షణంలో "అందరిల్లు" దుఃఖసాగరంలో మునిగిపోయింది.ఆ తెల్లవార్లూ వార్త తెలిసినవారు అందరిల్లుకి వస్తూనే ఉన్నారు.

హైమవతి, భారతుల దుఃఖానికి అడ్డుకట్ట లేదు. హైమవతి ఆమె పరిచయం నుంచి ఇన్నేళ్లు జరిగినవి గుర్తు చేసుకుని కుమిలి కుమిలి ఏడుస్తోంది. శారదమ్మ తన జీవితంలో అనేక కష్ట సమయాల్లో ఆమె ఇచ్చిన సలహాలను, ధైర్యాన్ని తలచుకుని తలచుకుని కంట తడి పెడుతూనే, పనులు చక్క బెడుతోంది. పార్వతీశం గారు శయనమ్మ ఔన్నత్యాన్ని గుర్తు చేసుకుంటూ వచ్చిన వాళ్లందరితో మాట్లాడుతున్నారు. రాజేశ్వరి, నాగరాజు, అలిమేలు, శ్రీనివాసులు, రామరాజు అందరూ వచ్చారు. రాజేశ్వరిని చూసి భారతి దుఃఖం ఎక్కువయ్యింది. రాజేశ్వరి మనసులో ఏముందో కానీ నిబ్బరంగా ఉంది. చెల్లెలినీ, మిగిలిన వాళ్ళందరినీ ఓదార్చింది.

పెళ్ళి కంటే ఘనంగా సాగింది ఆ మరునాడు జరిగిన అంతిమయాత్ర. ఆ ఊరిలో వారే కాక, చుట్టు పక్కలనుండి వేల సంఖ్యలో జనాలు తరలి వచ్చి అందులో పాల్గొన్నారు.

శవ యాత్ర మొదలయ్యేముందు పార్వతీశం భారతి దగ్గరకు వచ్చి అడిగాడు.

"అమ్మా, నీకు గుండె ధైర్యం ఉందా?" అయన దేనికి అడుగుతున్నాడో ఆమెకు తెలియలేదు. రవి వచ్చి ఆమెతో అన్నాడు.

"ఏం భారతీ? మీ అమ్మమ్మ కోరిక నెరవేరుస్తావా?"

"ఏమిటది మావయ్యా?" అయోమయంగా అంది భారతి.

"సుశీల వెళ్ళిపోయాక నాతో మాట్లాడుతూ ఓ సారి అన్నదమ్మా ముసలమ్మ గారు, 'నేను పోతే భారతి చేత తలకొరివి పెట్టించండి బాబుగారూ' అని. నువ్వు రాగలవా? ఇక్కడే ఊరి చివర ఆవిడ పొలంలోనే " పార్వతీశం అన్నాడు.

రాజేశ్వరి ఆ మాటలు విని మొహం చిట్లించింది.

" ఇది ఏం చోద్యం నాన్నా? అది చిన్నది. పైగా ఆడవాళ్లు స్మశానం కి వెళ్ళటం మన ఆచారం కాదు."

"నిజమే రాజూ, అది చిన్నది. అందుకే అడుగుతున్నాను. రాగలవా అని. అంత్యక్రియలు జరిగేది స్మశానంలో కాదు. మన ఊళ్ళో ఆవిడ కొనుక్కున్న పొలంలోనే! తన శరీరం బూడిద అయ్యాక అక్కడి మట్టిలోనే కలిసిపోవాలని ఆవిడ ఆశ. అంత గొప్ప సమాజ సేవకురాలికి అంత్యక్రియలు జరిపే అవకాశం రావటం ఓ అదృష్టం." ముక్కు విరిచింది రాజేశ్వరి అయిష్టంగా. కానీ అక్కడున్న వాళ్ళు ఎవ్వరూ అడ్డు పెట్టలేదు ఆవిడ కోరికకి.

భారతి భర్తవంక చూసింది. అతని ఆమోదం చూపులతోనే తెలిసింది ఆమెకు.

"నీ పక్కనే నేను, బావా ఉంటాము భారతీ. ఆవిడ చివరి కోరిక తీర్చటం మన ధర్మం." అన్నాడు రవి. ఆఖరి క్షణంలో శారదా, హైమవతులు కూడా సిద్ధపడ్డారు దహనానికి వెళ్ళటానికి. వారిని ఊళ్లోని ఎందరో ఆడవాళ్లు అనుగమించారు. కడుపుతో ఉన్న రాజేశ్వరిని మటుకు, శ్రమ తట్టుకోలేదని ఇంటిదగ్గరే ఉంచేశారు అందరూ కలిసి హరినామ స్మరణతో చివరి వరకూ వెళ్లారు.

"శయనమ్మ గారికీ జై" అన్న నినాదాలు నాలుగు దిక్కులా వ్యాపిస్తుండగా భారతి, రవి, పార్వతీశం కలిసి శయనమ్మగారి చితికి నిప్పంటించారు.

ఆ రాత్రి శయనమ్మ గారి జ్ఞాపకాలతో మనసు నింపుకుని ఒక్కొక్కటీ గుర్తుచేసుకుంటున్న భారతి రవితో అంది.

"అమ్మమ్మకు పోయేముందు సుశీల ఎలా కనిపించింది? నాకెందుకు కనిపించలేదు? అది ఆమె భ్రమ అంటావా?"

"కాక పోవచ్చు భారతీ. సుశీల ఆధ్యాత్మిక సాధనలో ఎంతో ముందుకు వెళ్ళి ఉంటె ఆమెకు ఒక యోగిగా అక్కడ కనిపించటం సాధ్యమే. తన మాట నిలబెట్టుకుంది సుశీల. గుర్తుంచుకో, మన భారతీయ యోగులకు అసాధ్యమేదీ లేదు. పైగా శయనమ్మ గారు కూడా ఎంతో పుణ్యాత్మురాలు, కర్మయోగి.

(తరువాయి వచ్చే సంచికలో)

COMMENTS